సాక్షి రంగారెడ్డి
గురువారం । 28 । డిసెంబర్ । 2023



పూల తోట.. లాభాల బాట
కొద్దిపాటి పొలంలో తక్కువ నీటితో లాభాలు ఆర్జించేందుకు రైతులు పూల తోటల సాగు వైపు దృష్టి సారించారు. 8లో ▸



కక్షతోనే తప్పుడు కేసులు
నిస్వార్థంగా సేవలందించిన మంచిరెడ్డి కిషన్‌రెడ్డిపై రాజకీయ కక్షతోనే కేసు పెట్టారని వెంకటరమణారెడ్డి అన్నారు. 8లో ▸



దుకాణంలో చోరీ
మహాలింగపురం శివారులో మోటార్ రివైండింగ్ షాప్‌లో దుండగులు రూ.6 లక్షలకు పైగా సామగ్రిని అపహరించారు. 8లో ▸

న్యూస్‌రీల్

నేడు కేంద్ర హోం మంత్రి పర్యటన

పార్లమెంట్ ఎన్నికలపై దిశా నిర్దేశం

ఇబ్రహీంపట్నం రూరల్: రానున్న పార్లమెంట్ ఎన్నికలపై కమలదళానికి దిశా నిర్దేశం చేసేందకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా గురువారం కొంగరకలాన్‌కు రానున్నారు. ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని కొంగర్‌కలాన్‌లో ఉన్న శ్లోక కన్వెన్షన్ హాల్ బీజేపీ రాష్ట్ర స్థాయి సమావేశాలకు వేదికైంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో 2023 శాసనసభ ఎన్నికల ఫలితాల విశ్లేషణతో పాటు 2024 లోక్ సభ ఎన్నికలకు ఎలా సిద్ధమవ్వాలి? వికసిత్ భారత్ సంకల్ప యాత్ర, సంస్థాగత విషయాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర పదాధికారులు, అధికార ప్రతినిధులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జాతీయ నాయకులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పార్లమెంట్ కన్వీనర్లు, జాయింట్ కన్వీనర్లు, పార్లమెంట్ ప్రభారీలు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా ఇన్‌చార్జిలు, జాతీయ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు తదితరులతో పాటుగా 2023 ఎన్నికల్లో అసెంబ్లీకి పోటీ చేసిన అభ్యర్థులు హాజరవుతారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అమిత్‌షాతో పాటుగా జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్‌చుగ్, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునిల్ బన్సల్, బీజేపీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, అరవింద్ మీనన్‌లు ముఖ్యఅతిథులుగా హాజరవ్వనున్నారు. ఇప్పటికే శ్లోక కన్వెన్షన్ హాల్ వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు అబ్దుల్లాపూర్‌మెట్‌కు డిప్యూటీ సీఎం భట్టి

అబ్దుల్లాపూర్‌మెట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టనున్న ప్రజాపాలన కార్యక్రమం గురువారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో నిర్వహించే కార్యక్రమానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క హాజరు కానున్నారు. ఆయన వెంట రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డిరంగారెడ్డిలు హాజరై ప్రజాపాలనను ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ మమతాబాయి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నూతన సీపీకి అభినందనలు



సీపీ సురేశ్‌బాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ సత్తయ్య

తుర్కయంజాల్: రాచకొండ కమిషనరేట్ నూతన సీపీగా నియమితులైన సురేశ్‌బాబును బుధవారం డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కార్తీక్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

31న రాత్రి ఓఆర్‌ఆర్, ఫ్లైఓవర్ల మూసివేత

రాయదుర్గం: నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో సైబరాబాద్ పోలీసులు పలు ఆంక్షలు విధించారు. డిసెంబర్ 31వ తేదీన ఓఆర్‌ఆర్ సహా పీవీ ఎక్స్‌ప్రెస్ వే, ఫ్లైఓవర్లన్నీ మూసివేయనున్నట్లు బుధవారం ప్రకటించారు. నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్డుపై రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు విమానాశ్రయం వెళ్లే వాహనాలకు తప్ప ఇతర లైట్ మోటార్ వాహనాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. పీవీఎన్‌ఆర్ ఎక్స్‌ప్రెస్ వే రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు విమానాశ్రయం వెళ్లే వాహనాలకు తప్ప ఇతర వాహనాలకు అనుమతి లేదు. ప్రయాణికులు తమ ప్రణాళికలను తదనుగుణంగా రూపొందించుకొని సహకరించాలని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

ఫిబ్రవరిలో తెలుగు వర్సిటీ స్నాతకోత్సవం

నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 16వ స్నాతకోత్సవాన్ని వచ్చే ఫిబ్రవరి మూడో వారంలో నిర్వహించనున్నట్లు వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్ రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయాల కులపతి డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ఎంఫిల్, పీహెచ్‌డీ పట్టాలను, ఆయా విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలను అందించనున్నట్లు తెలిపారు. గత మూడేళ్లలో విశ్వవిద్యాలయం నిర్వహించిన వి విధ కోర్సుల పరీక్షలలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు డిగ్రీ సర్టిఫికెట్లు పొందనున్నట్లు వెల్లడించారు.

ఇక ప్రజాపాలన!



రంగారెడ్డి కలెక్టరేట్‌లో ప్రజాపాలన దరఖాస్తు ఫారాలు తీసుకుంటున్న అధికారులు

నేటి నుంచి జనవరి ఆరు వరకు
- డిసెంబర్ 31, జనవరి ఒకటిన సెలవు
- ఆరు గ్యారంటీలకు ఈ దరఖాస్తులే కీలకం
- స్వీకరణకు ప్రత్యేక బృందాలు
- ప్రతీ వంద కుటుంబాలకు ఒక కౌంటర్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రజా పాలన కార్యక్రమానికి సర్వం సిద్ధమైంది. ఆరు గ్యారంటీలకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ గురువారం ప్రారంభం కానుంది. ఇందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక బృందాలను ఏర్పాట్లు చేసింది. జిల్లా వ్యాప్తంగా కేటాయించిన తేదీల ప్రకారం గ్రామ సభలు నిర్వహించి అర్హులైన పేదల నుంచి అర్జీలను స్వీకరించనున్నారు. డిసెంబర్ 31, జనవరి 1న సెలవు ఉన్నందున అర్జీలు స్వీకరించరు. గ్రామాలతో పాటుగా మున్సిపాలిటీలు, వార్డుల వారీగా సైతం సభలు నిర్వహించి, దరఖాస్తులు స్వీకరించనున్నారు. జనవరి ఆరు వరకు కొనసాగనున్న ఈ ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా మహాలక్ష్మి పథకం, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇల్లు, చేయుత పథకాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఇదిలా ఉంటే పాత రేషన్ కార్డులను రద్దు చేయనున్నట్లు సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ఉదయం 8 గంటల నుంచే షురూ

ప్రతీ కుటుంబానికి ఒక దరఖాస్తు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. బుధవారం ఆయా బృందాలకు దరఖాస్తులను అందజేశారు. రోజుకు రెండు గ్రామ పంచాయతీలలో సమావేశాలు ఏర్పాటు చేసి, వారి నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ప్రతీ వంద కుటుంబాలకు ఒక కౌంటర్ ఏర్పాటు చేయనున్నారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఎంఈఓలు, డిప్యూటీ తహసీల్దార్లు ఈ బృందాలకు నేతృత్వం వహించనున్నారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు విడతల్లో సమావేశాలు నిర్వహించనున్నారు. క్షేత్రస్థాయి ఉద్యోగి నుంచి ఉన్నత స్థాయి అధికారుల వరకు అందరూ సమష్టిగా ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఏ రోజు ఏ గ్రామం, వార్డులో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించనున్నారనే అంశంపై ముందస్తుగా ప్రచారం నిర్వహించనున్నారు. ఒక రోజు ముందుగా ఆయా గ్రామాల్లో టాంటాం వేయించనున్నారు. ప్రజాపాలనకు సంబంధించి ప్రతీ కుటుంబానికి దరఖాస్తు అందేలా ప్రణాళిక రూపొందించారు. దరఖాస్తుల స్వీకరణలోనే కాదు, దరఖాస్తులను భద్రపర్చడంలో అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఒక వేళ ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది.

గ్రామ సభల వివరాలు

తేదీ	గ్రామాలు
డిసెంబర్ 28న	98
29న	103
30న	105
జనవరి 2న	108
3న	94
4న	50

అందరి గురి చేవెళ్లపైనే!

- ఇప్పటికే అభ్యర్థిని ప్రకటించిన బీఆర్‌ఎస్
- సిట్టింగ్ అభ్యర్థికే అవకాశం
- కాంగ్రెస్ నుంచి ఆశావహుల మధ్య పోటా పోటీ
- బీజేపీ నుంచి కొండాను బరిలో దింపే చాన్స్..?



సాక్షి, రంగారెడ్డిజిల్లా: పార్లమెంట్ ఎన్నికలకు సమయం ఉన్నప్పటికీ.. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో మాత్రం ఎన్నికల వేడి రాజుకుంది. సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డికే మళ్లీ ఛాన్స్ ఇస్తూ బీఆర్‌ఎస్ అధిష్టానం ఊహాగానాలకు చెక్‌పెట్టగా, ఎలాగైనా ఈ స్థానాన్ని చేజిక్కించుకోవాలని ఇటు కాంగ్రెస్, అటు బీజేపీ ఆశావహులు పోటీపడుతున్నారు. చేవెళ్ల కేంద్రంగా రాజకీయ వ్యూహాలు రచిస్తున్నాయి. ఇటీవల మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓటమి పాలైన కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సహా ఈ అసెంబ్లీ టికెట్ ఆశించి, చివరి నిమిషంలో భంగపడిన పారిజాత నర్సింహారెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డికి అతి సన్నిహితుడైన ఎలుగింటి మధుసూదన్‌రెడ్డి సహా మరికొంత మంది నేతలు పోటీ పడుతున్నారు. బీజేపీ నుంచి మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పోటీకి సిద్ధం అవుతున్నారు. ఇప్పటికే ఆయన ఆ పార్లమెంట్ స్థానం పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లోనూ పట్టు సాధించేందుకు యత్నిస్తున్నారు. తనకంటూ ఓ ప్రత్యేక కేడర్‌ను తయారు చేసుకుని ముందుకెళ్తున్నారు.

ఆ అంతర్యం ఏమిటో?

నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం 2009లో ఏర్పడింది. ఈ పార్లమెంట్ పరిధిలో తాండూరు, వికారాబాద్, పరిగి, చేవెళ్ల, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. తొలి ఎన్నికల్లో దివంగత సూదిని జైపాల్‌రెడ్డి ఇక్కడి నుంచి విజయం సాధించారు. రెండోసారి పోటీకి ఆయన ఆసక్తి చూపలేదు. 2014లో ఎన్నికల్లో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఇక్కడి నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ఆ తర్వాత పోటీ చేసినా ఓటమి పాలయ్యారు. 2018 సార్వత్రిక ఎన్నికల్లో ఇక్కడి నుంచి కారుగుర్తుపై పోటీ చేసిన రంజిత్‌రెడ్డి విజయం సాధించారు. ఇక్కడి నుంచి ఒకసారి విజయం సాధించిన వారు.. రెండోసారి పోటీకి పెద్దగా ఆసక్తి చూపిన దాఖలాలు లేవు. పోటీ చేసిన వారు ఓటమి పాలయ్యారు. తెలంగాణ వ్యాప్తంగా 17 లోక్‌సభా స్థానాలుండగా, ఆ పార్టీ అధిష్టానం కేవలం చేవెళ్ల లోక్‌సభ స్థానానికే అభ్యర్థిని ప్రకటించడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటనేది అంతు చిక్కడం లేదు.

అనేక సవాళ్లు

అసెంబ్లీ ఎన్నికల్లో ఎంపీ రంజిత్‌రెడ్డి వికారాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా వ్యవహరించారు. అక్కడ బీఆర్‌ఎస్ ఓటమి పాలైంది. చేవెళ్ల అభ్యర్థికి అండదండగా నిలిచినప్పటికీ.. కేవలం 268 ఓట్లతోనే బీఆర్‌ఎస్ గట్టెక్కింది. రాజేంద్రనగర్ నుంచి ఆయన ఎమ్మెల్యే టికెట్ ఆశించినట్లు అప్పట్లోనే పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను పక్కన పెట్టి.. ఆయన సొంతంగా పలు కార్యక్రమాలు చేశారు. మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి తన తనయుడికి చేవెళ్ల నుంచి ఎంపీ టికెట్ ఆశించి భంగపడింది. ప్రస్తుత పరిస్థితుల్లో వారిద్దరూ ఆయన గెలుపునకు కృషి చేస్తారా? అంటే అనుమానమే. దీనికి తోడు శేరిలింగంపల్లి, మహేశ్వరం, రాజేంద్రనగర్‌లో బీజేపీ బలంగా ఉంది. వికారాబాద్, పరిగి, తాండూరులో కాంగ్రెస్ హవా కొనసాగుతోంది. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు ఇప్పటికీ పూర్తికాలేదు. గత ప్రభుత్వం జీఓ నంబర్ 111 ఎత్తి వేసినట్లు చెపుతున్నా.. సాంకేతికంగా ఇప్పటికీ జీఓ అమల్లోనే ఉంది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ఆయన మళ్లీ నెగ్గుకొస్తారా? అంటే వేచి చూడాల్సిందే.

అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గాల వారీగా పోలైన ఓట్లు

నియోజకవర్గం	బీఆర్‌ఎస్	కాంగ్రెస్	బీజేపీ
శేరిలింగంపల్లి	1,57,557	1,10,934	80,293
రాజేంద్రనగర్	1,21,734	62,057	59636
మహేశ్వరం	1,25,578	70,657	99,391
చేవెళ్ల	75,843	74,981	37,886
పరిగి	74,523	98,536	16,653
వికారాబాద్	73,992	86,885	7,132
తాండూరు	78,079	84,662	4,087



కొలువుదీరిన అమ్మవారి విగ్రహం(ఫైల్)



బోసిపోయిన గర్భాలయం

ఏడాది గడుస్తున్నా..

- కొలిక్కి రాని మైసమ్మ తల్లి విగ్రహం చోరీ కేసు
- అధికారులే తొలగించారని తాడిపర్తి వాసుల ఆరోపణ
- అనుమతి ఇస్తే మరో విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తామని వెల్లడి

యాచారం: భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా పేరొందిన తాడిపర్తి తాటికుంట మైసమ్మ తల్లి విగ్రహం చోరీకి గురై ఏడాది గడుస్తోంది. యాచారం-కడ్తాల్, కందుకూరు మండలాల సరిహద్దు అటవీ ప్రాంతంలో ఈ అమ్మవారి ఆలయం ఉంది. ఈ అమ్మవారిని నమ్ముకున్న యువతకు ఉద్యోగాలు, పెళ్లిలు, సంతానం కలగడం, రాజకీయ నాయకులు ప్రజాప్రతినిధులుగా గెలుపొందారని ప్రసిద్ధి. అమ్మవారి దర్శనానికి జిల్లా వాసులతో పాటు నల్గొండ, నాగర్‌కర్నూల్, హైదరాబాద్ తదితర జిల్లాల నుంచి నిత్యం వేలాదిగా తరలివచ్చి అమ్మవారి మొక్కులు తీర్చుకుని పండుగలు చేసుకునే వారు. ఇంతటి మహిమ ఉన్న అమ్మవారి విగ్రహం చోరీకి గురి కావడంతో భక్తులకు తీవ్ర ఆందోళన, ఆగ్రహాన్ని కలిగించింది.

నేటికీ లభించని ఆధారాలు

ఇంతటి ప్రాశస్త్యాన్ని కలిగిన అమ్మవారి విగ్రహం చోరీకి గురై ఏడాది గడిచింది. ఇందుకు సంబంధించి నేటికీ చిన్న ఆధారం లభించలేదు. అమ్మవారి విగ్రహాన్ని అటవీ శాఖ అధికారులే తస్కరించారని అప్పట్లోనే గ్రామస్తులు పోలీసులకు, అటవీ శాఖ అధికారులకు, రెవెన్యూ అధికారులకు, దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులకు ఫిర్యాదులు చేశారు. గత ప్రభుత్వం తాడిపర్తి గ్రామాన్ని ఫార్మాసిటీ కింద ఎంపిక చేయడం, అటవీ ప్రాంతంలో ఉన్న మైసమ్మ తల్లిని దర్శనం చేసుకోవడం కోసం నిత్యం భక్తుల రద్దీ పెరగడం, భవిష్యత్‌లో భక్తుల తాకిడి పెరిగితే ఇబ్బంది కలుగుతుందనే భావనతోనే అటవీ శాఖ, దేవాదాయ, రెవెన్యూ శాఖల అధికారులే అమ్మవారి విగ్రహాన్ని తీసేశారనే భక్తుల ఆరోపణ.

ప్రతిష్ఠాపనకు అమ్మవారికి విగ్రహం

అటవీ ప్రాంతంలో కొలువైన అమ్మవారి ఆలయానికి నిత్యం వందలాది మంది, గురు, ఆదివారాల్లో వేలాది మంది భక్తులు తరలివచ్చేవారు. ఆలయం దేవాదాయ, ధర్మదాయ శాఖ ఆధీనంలో ఉండడంతో ఆలయ నిర్వహణ నుంచి గ్రామ పంచాయతీకి రూ.లక్షల్లో ఆదాయం సమాకూరుతుండేది. భక్తుల బోనాలు, జంతు బలులతో పండుగలు చేసుకోవడంతో అటవీ ప్రాంతమంతా భక్తులతో కిటకిటలాడేది. అమ్మవారి విగ్రహం చోరీ కేసు ఛేదించడంలో అధికారులు నిర్లక్ష్యం చేయడంతో గ్రామస్తులు 2022 డిసెంబర్‌లోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని దుర్గి నుంచి అమ్మవారి విగ్రహానికి తీసుకువచ్చి ప్రతిష్ఠాపనకు సంకల్పించారు. కానీ భక్తులను అటవీ ప్రాంతంలోకి అనుమంతించకుండా ఆయా శాఖల అధికారులు కట్టుదిట్టం చేశారు. గ్రామంలో 144 సెక్షన్ అమలు చేసి భయాందోళనలు కలిగించడంతో ప్రజలు ప్రతిష్ఠాపనకు వెనుకడుగేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడం, ఫార్మాసిటీ రద్దు చేయడంతో భక్తుల్లో మళ్లీ తాటికుంట మైసమ్మ తల్లి దీవెనల కోసం ఆశతో ఎదురుచూస్తున్నారు.

దర్శన భాగ్యం దక్కలేదు



తాటికుంట మైసమ్మ తల్లిని దర్శించుకోవాలని చాల ఏళ్లుగా అనుకుంటున్నాను. అమ్మవారికి దర్శించుకున్న స్నేహితులకు మంచి జరిగిందన్నారు. గతేడాది అమ్మవారిని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకోవాలని అనుకున్నా. కానీ అమ్మవారి విగ్రహన్నే ఎత్తుకెళ్లారని తెలిసి బాధపడినా. మళ్లీ ప్రతిష్ఠిస్తే వెంటనే దర్శానికి వెళ్తాను.

– దూదిపాల చంద్రారెడ్డి, హైదరాబాద్

సహకరిస్తే ప్రతిష్ఠిస్తాం



అమ్మవారి ఆలయం మా ఆధీనంలోనే ఉంది. మైసమ్మ తల్లి అనుగ్రహం కోసం నిత్యం వందలాది మంది భక్తులు తరలివచ్చేవారు. ఏడాది క్రితం అమ్మవారి విగ్రహాన్ని తస్కరించారు. పోలీస్, అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదులు చేశాం. గ్రామస్తుల సహకారం ఉంటే అమ్మవారి నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తాం. భవిష్యత్‌లో అమ్మవారి ఆలయం మహా పుణ్యక్షేత్రంగా మారడం ఖాయం.

– ప్రణీత్‌కుమార్, ఆలయ ఇన్‌చార్జి, దేవాదాయ, ధర్మాదాయ శాఖ

కొత్త విగ్రహం తెచ్చాం



తాటికుంట మైసమ్మ తల్లి విగ్రహం అపహరణతో కొత్త విగ్రహన్ని ప్రతిష్ఠాపనకు సంకల్పించాం. గతేడాది డిసెంబర్‌లో దుర్గి నుంచి అమ్మవారి నూతన విగ్రహాన్ని తీసుకువచ్చాం. అటవీ, పోలీస్ శాఖ అధికారులు అనుమతులు ఇవ్వలేదు. గ్రామంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి గ్రామస్తులను భయాందోళనకు గురి చేశారు. అమ్మవారి కొత్త విగ్రహం నేటికి గ్రామంలోని ఆలయంలోనే ఉంది.

– ముప్పిడి బావయ్య, ఎంపీటీసీ సభ్యుడు, తాడిపర్తి

ధ్యానంతోనే జ్ఞానం, ఆనందం



మాట్లాడుతున్న పరిమళపత్రి



సందేశమిస్తున్న రాధామనోహర్

2024లో వైభవంగా నిర్వహిస్తాం
- పీఎస్‌ఎస్‌ఎం గ్లోబల్ ఫౌండర్ పరిమళ పత్రి
- జీవకోటి స్వేచ్ఛకు పాటుపడాలి
- హిందూ ధర్మ ప్రచారకుడు రాధామనోహర్
- 7వ రోజుకు చేరిన ధ్యాన మహాయాగం

కడ్తాల్: వచ్చే ఏడాది పత్రీజీ మహిళా ధ్యాన మహాయాగం వైభవంగా నిర్వహిస్తామని పిరమిడ్ స్పిరుచువల్ సొసైటీ మూవ్‌మెంట్(పీఎస్‌ఎస్‌ఎం)గ్లోబల్ ఫౌండర్ పరిమళ పత్రి అన్నారు. మండల పరిధిలోని మహేశ్వర మహా పిరమిడ్‌లో పత్రీజీ ధ్యాన మహాయాగాలు ధ్యాన జనుల సందడితో కొనసాగుతున్నాయి. ఈ ధ్యాన మహాయాగాలు బుధవారంతో ఏడవ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా పత్రీజీ కూతురు పరిమళ పత్రి మాట్లాడుతూ.. సత్యం తెలుసుకోవాలనే కోరిక ఉన్నవారే పీఎస్‌ఎస్‌ఎంలోకి వస్తారన్నారు. ప్రతీ మనిషి భయం లేకుండా జీవించడమే పత్రీజీ కోరుకునే వారని గుర్తు చేశారు. ధ్యానం ద్వారా పొందిన జ్ఞానం దైనందిన జీవితంలో తప్పక ఆచరించాలని సూచించారు. ధ్యానంతోనే ప్రజలు ఆనందంగా ఉంటారన్నారు. ప్రతీ ఒక్కరు ధ్యాన ప్రచారం చేయాలని కోరారు.

శ్వాసపై ధ్యాస అవసరం

హిందూ ధర్మ ప్రచారకుడు రాధామనోహర్ ప్రసంగిస్తూ.. ప్రతీ మనిషి సరల జీవకోటి స్వేచ్ఛ కోసం పాటుపడాలని సూచించారు. శ్వాసపై ధ్యాస ఉంటేనే సంపూర్ణ శక్తి లభిస్తుందన్నారు. తనను తాను తెలుసుకోవాలని పత్రీజీ చెప్పిన సూత్రం ఎంతో గొప్పదన్నారు. అనంతరం ధ్యాన జగత్ మాస పత్రిక-2024తోపాటు, ఓట్ ఫర్ వెజ్ వెబ్‌సైట్‌ను పరిమళ పత్రి, పరిణీత పత్రి ఆవిష్కరించారు. ధ్యాన వేదికపై కళాకారుల నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, ధ్యానుల, పిరమిడ్ మాస్టర్‌ల అనుభవాలు ఆకట్టుకున్నాయి. ధ్యాన కేంద్రానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ధ్యానులకు ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు పెద్ద ఎత్తున్న ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు హనుమంతరాజు, బాలకృష్ణ, నవకాంత్, ఆనంద్, రాయజగపతిరాజు, వాణి, మాధవి, కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.



హాజరైన ధ్యానులు



కళాకారుల నృత్య ప్రదర్శన



అర్హులు దరఖాస్తు చేసుకోవాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య
- ‘ప్రజాపాలన’పై అవగాహన సదస్సు

మొయినాబాద్‌రూరల్: గ్రామాలలో నిర్వహించే ప్రజాపాలన దరఖాస్తు కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు కొనసాగించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. బుధవారం మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సంధ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాపాలన అవగాహన సదస్సుకు ఎమ్మెల్యే యాదయ్య, నియోజకవర్గం ప్రజాపాలన ఇన్‌చార్జి, డీఆర్‌డీఏ అధికారి ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరు సంక్షేమ పథకాల అమలు కోసం గ్రామాల్లో జరిగే కార్యక్రమంలో అందరూ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అనంతరం ప్రజాపాలన ఇన్‌చార్జి ప్రభాకర్ మాట్లాడుతూ.. గ్రామాలలో ప్రజాప్రతినిధులు సహకరించి దరఖాస్తుల స్వీకరణ విజయవంతం చేయాలని సూచించారు. ముఖ్యంగా ఇంటికో దరఖాస్తు ఉంటుందని ఇంకా వేరే విషయాలు ఉంటే తెల్ల పేపర్‌పై రాసి అభ్యర్థిస్తే, వారికి సైతం రసీదు ఇస్తామన్నారు. ముఖ్యంగా సర్పంచ్‌లు సహకరించి 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు స్వీకరిస్తున్న దరఖాస్తుల పర్వాన్ని కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మహిళా అధ్యక్షురాలు శోభావెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలు మంజులరవియాదవ్, ఎంపీపీ నక్షత్రంజేవంతు, జెడ్పీటీసీ శ్రీకాంత్, ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కుమార్, సర్పంచ్‌లు మనోజ్‌కుమార్, చందనచంద్రయ్య, అంబాజీరావు, ఎంపీటీసీ శ్రీనివాస్, అధికారులు వెంకటయ్య, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

‘ప్రజాపాలన’తో పేదలకు మేలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ‘ప్రజాపాలన’కు శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అందజేస్తామన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజాపాలన కార్యక్రమాన్ని ఈనెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు నిర్వహిస్తుందన్నారు. పట్టణాల్లో, గ్రామాల్లో నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వమే ప్రతి ఇంటికీ ఆరు గ్యారంటీలకు సంబంధించి దరఖాస్తు ఫారాలను అందజేస్తుందన్నారు. సంక్షేమ పథకాలను నిష్పక్షపాతంగా, నిర్భయంగా అందించబోతుందన్నారు. పేదలకు ప్రభుత్వ లబ్ధి చేకూరే విధంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. సమావేశంలో నాయకులు బాబర్‌ఖాన్, చెన్నయ్య, శ్రీకాంత్‌రెడ్డి, సిద్ధర్థ, బస్వం, మురళీమోహన్, జగదీశ్వరప్ప, మోహన్, మధు, ఖదీర్, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా ‘ప్రజాపాలన’

ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అమరేందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని గ్రామాలు, మున్సిపాలిటీ వార్డుల్లో తప్పకుండా నిర్వహించాలని ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అమరేందర్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28వ తేదీ నుంచి జనవరి 6 వరకు కొనసాగుతుందన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. ప్రజాప్రతినిధులు తప్పకుండా ఆయా గ్రామాల్లో, వార్డుల్లో పాల్గొనాలని సూచించారు. దరఖాస్తులు చేసుకున్న వాటికి అధికారులు వెంటనే రసీదు పత్రం ఇవ్వాలన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రైతు సంక్షేమానికి కృషి

శంషాబాద్ రూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుల సంక్షేమం కోసం కృషి చేసినట్లు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. మండలంలోని మల్కారంలో బుధవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన గోదాం, సొసైటీ కార్యాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రూ.1.23 కోట్ల నిధులతో గోదాం, కార్యాలయం భవనం నిర్మించామన్నారు. గోదాం నిర్మాణానికి రెండు ఎకరాలు కేటాయించడంతో పాటు నిధుల మంజూరుకు అప్పటి ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. రైతులు గోదాంను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధికారంలో లేకున్నా బీఆర్‌ఎస్ పార్టీ ప్రజల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. కార్యకర్తలు అధైర్యం పడవద్దని, తాను ఎల్లప్పుడూ అందరికీ అందుబాటులో ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ సత్తయ్య, సొసైటీ చైర్మన్ బి. సతీష్, సర్పంచ్ మాధవి, ఎంపీపీ జయమ్మ, జడ్పీటీసీ తన్వీ, తదితరులు పాల్గొన్నారు.

పూల తోట.. లాభాల బాట

- తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు
- సీజన్‌లో మంచి డిమాండ్

ఆరుగాలం శ్రమించి మట్టి నుంచి సిరులు పండించడానికి రైతన్నలు నిత్యం భూమితో పోరు చేస్తారు. మంచి దిగుబడులు వస్తాయనే ఉద్దేశంతో పెట్టుబడులు సైతం లెక్క చేయకుండా సాగులో నిమగ్నమవుతారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు గడించేందుకు కొందరు అన్నదాతలు పూల సేద్యాన్ని ఎంచుకున్నారు.


ఏట్ల ఎర్రవల్లిలో జర్మన్ చామంతి సాగు చేస్తున్న రైతులు

షాబాద్: కొద్దిపాటి పొలంలో తక్కువ నీటితో ఎక్కువ లాభాలను ఆర్జించేందుకు రైతులు పూల తోటల సాగువైపు దృష్టి సారించారు. సీజన్లలో చామంతి, బంతి, జర్మన్, గులాబీ తదితర పూలకు మంచి డిమాండ్ ఉండడంతో దానిపై ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. షాబాద్ మండల సర్దార్‌నగర్ గ్రామానికి చెందిన దాదె రాజు, స్వప్న దంపతులు పూలసాగులో మంచి లాభాలు గడిస్తున్నారు. మూడు ఎకరాల పొలంలో గులాబీ, చామంతి, బంతి పూల తోటను సాగు చేస్తున్నారు. అంతిరెడ్డిగూడ గ్రామానికి చెందిన గడ్డం రాజు ఎకరం భూమిలో గులాబీ సాగు చేస్తూ మంచి లాభాలు పొందుతున్నారు.

ఆరుతడి సాగుకు మొగ్గు

మండలంలోని ఏట్ల ఎర్రవల్లి, మాచన్‌పల్లి, హైతాబాద్, మద్దూరు, సోలీపేట్, నాంధార్‌ఖాన్‌పేట్ తదితర గ్రామాల్లో రైతులు ప్రభుత్వం కూడా సంప్రదాయ పంటలను వదిలి ఆరుతడి సాగుకు మొగ్గు చూపాలని ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో చాలా మంది వివిధ రకాల పూల తోటల సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. శివస్వాములు, హనుమాన్, అయ్యప్ప స్వాముల పూజలకు, పెళ్లిళ్ల సీజన్లలో పూలకు మంచి డిమాండ్ ఉంది. వేసవిలోనూ పూల సాగు లాభదాయకమని పలువురు రైతులు పేర్కొంటున్నారు. పెట్టుబడులు పెట్టి నష్టపోయే బదులు తక్కువ ఖర్చు, శ్రమతో పూల తోటల సాగులో మంచి లాభాలు వస్తున్నాయి. తాము పండించిన పూలను నగరంలోని పూల మార్కెట్లకు తరలిస్తునట్లు తెలిపారు. కిలో పూలు రూ.300 నుంచి రూ.400 వరకు ధర పలుకుతుందని చెబుతున్నారు. అంతే కాకుండా చుట్టు పక్కల ఉండే గ్రామాల ప్రజలు తోట వద్దకు వచ్చి పూలను కొంటున్నట్లు చెప్పారు.

మంచి గిరాకీ



ఎకరం పొలంలో ప్రతి ఏటా గులాబీ, బంతి, చామంతి పూలను సాగు చేస్తూ అధిక లాభాలను పొందుతున్నా. పెళ్లిళ్లు, పూజల సమయంలో మంచి గిరాకీ ఉంటుంది. చామంతి పూలను నగరంలోని గుడిమల్కాపూర్ పూల మార్కెట్‌కు తరలించి విక్రయిస్తున్నా. తక్కువ పెట్టుబడితో పూల సాగులో అధికంగా లాభాలను పొందొచ్చు.

– దాదె రాజు, పూల రైతు, సర్దార్‌నగర్, షాబాద్

రాజకీయ కక్షతోనే తప్పుడు కేసులు

గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ వెంకటరమణారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: పద్నాలుగు ఏళ్లగా ఇబ్రహీంపట్నం ప్రజలకు నిస్వార్థంగా సేవలందించిన నాయకుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి అన్నారు. మంచిరెడ్డిపై రాజకీయ కక్షలతోనే తప్పుడు కేసులు పెట్టారని ఆయన పేర్కొన్నారు. పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో కౌన్సిలర్లతో కలిసి విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనరల్ స్థానంలో ఎస్సీ దళిత మహిళను గెలిపించి, చైర్‌పర్సన్‌ను చేస్తే ఆయనపైనే తప్పుడు కేసులు పెట్టించడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. వైస్ చైర్మన్ ఆకుల యాదగిరి, కౌన్సిలర్లు జగన్, సుజాత రవీందర్‌లు మాట్లాడుతూ.. అవినీతిని కప్పి పుచ్చుకోవడానికే కేసులు పెట్టారన్నారు. తక్కువ సంఖ్యలో ఉన్న బుడగ జంగాలను చైర్మన్ చేసినందుకు ఈ కేసులు పెడతారా అని ప్రశ్నించారు. అవినీతి చైర్మన్‌ను అవిశ్వాసం పెట్టి తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ సుల్తాన్, కౌన్సిలర్లు శంకరయ్య, మోహన్‌నాయక్, విశాల విద్యాసాగర్, శ్రీలతరాంబాబు, మాజీ కౌన్సిలర్ సురేష్, నాయకులు మైసయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

మోటార్ వైండింగ్ దుకాణంలో చోరీ

రూ.6 లక్షల సామగ్రి అవహరణ


దుండగులు కత్తిరించిన రేకు

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మండలంలోని మహాలింగపురం గ్రామ శివారులో మోటార్ వైండింగ్ దుకాణంలో దుండగులు రూ.6 లక్షలకు పైగా సామగ్రిని అపహరించారు. బాధితుడు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. గ్రామానికి చెందిన మొహమ్మద్ మహబూబ్ శివారులో మోటార్ వైండింగ్ షాప్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. రోజు మాదిగానే మంగళవారం రాత్రి షాపునకు తాళం వేసి ఇంటికి వెళ్లారు. బుధవారం షాపు తెరిచి చూడగా రివైండింగ్ మోటార్‌లు అన్ని చెల్లా చెదురుగా పడి ఉన్నాయి. దుకాణం వెనుక భాగంలో రేకును కత్తిరించి, రూ.6 లక్షల విలువ గల మోటార్ సామగ్రి, వైర్లను దొంగలించారు. దుకాణంలో ఉన్న సీసీ కెమెరాలతో పాటు హార్డ్ డెస్క్‌ను సైతం అపహరించారని ఆయన తెలిపారు. బాధితుడు మహబూబ్ శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ లక్ష్మీనారాయణ సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

స్క్రాప్ దుకాణంలో అగ్ని ప్రమాదం


అగ్నికి ఆహుతి అయిన సామగ్రి

అత్తాపూర్: ఎలాంటి అనుమతులు లేకుండా, నియమ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న పరిశ్రమలు, దుకాణాలలో వరుస అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. సులేమాన్‌నగర్ డివిజన్ పరిధిలోని ఎంఎం పహాడీలో చింతల్‌మెట్‌కు చెందిన ముజీబ్, ముజాహిద్ అహ్మద్‌లు స్క్రాప్ దుకాణంతో పాటు సోఫాలు తయారు చేసే పరిశ్రమను ఎలాంటి అనుమతులు లేకుండా గుట్టు చప్పుడు కాకుండ కొనసాగిస్తున్నారు. బుధవారం తెల్లవారు జామున విద్యుత్ ప్రమాదంతో ఒక్క సారిగా మంటలు చెలరేగాయి. దాంతో షాపులోని రూ.20 నుంచి 25లక్షల విలువ చేసే సామగ్రి కాలి బూడిదయ్యిందన్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఆరు ఫైరింజన్‌లతో అక్కడకు చేరుకుని మంటలను ఆర్పివేశారు. గృహ సముదాయాల మధ్య అగ్ని ప్రమాదం జరగటంతో చుట్టు పక్కల వారు శ్వాస ఆడక ఉక్కిరి, బిక్కిరి అయి పరుగులు పెట్టారు. ఇలాంటి పరిశ్రమలను ఏర్పాటు చేసి ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య


మురళిమోహన్‌గౌడ్(ఫైల్)

మొయినాబాద్: ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధిలోని చిన్నషాపూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం .. గ్రామానికి చెందిన చేగూరి శ్రీశైలంగౌడ్ కుమారుడు మురళి మోహన్‌గౌడ్(22) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవారు. కొంత కాలం క్రితం సొంత భూమి విక్రయించి వచ్చిన డబ్బులతో ఇతర చోట్ల అగ్రిమెంట్ చేసుకున్నారు. రిజిస్ట్రేషన్‌కు సమయం దగ్గర పడటంతో సరిపడా డబ్బులు లేక ఇబ్బందులు పడ్డారు. డబ్బులు ఎక్కడి నుంచి తేవాలని మనస్తాపం చెంది అప్పారెడ్డిగూడ సమీపంలోని జామతోటలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. తోటలో పనిచేసే వ్యక్తి గమనించి స్థానికులకు సమాచారం అందించారు. అనంతరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బీడీలకు వెళ్లి.. అనంత లోకాలకు

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

కొత్తూరు: ఆర్టీసీ బస్సును ఢీకొని రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ జాతీయ రహదారిపై చేగూరు కూడలి వద్ద మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అరవింద్(28) కొన్ని నెలలుగా స్థానికంగా ఉన్న ఓ ప్రీకాస్ట్ వాల్ తయారీ ప్లాంట్‌లో పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో రాత్రి వేళ బీడీలు తెచ్చుకునేందుకు బయటకు వెళ్లి చేగూరు కూడలి వద్ద రోడ్డు దాటి వస్తుండగా ఆర్టీసీ గరుడ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన అరవింద్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై మృతుడి స్నేహితుడు ముజామిల్‌ఖాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


ప్రమాదంలో మృతి చెందిన వెంకటేశ్

కడ్తాల్: మండల పరిధిలోని మక్తమాధారం గేట్ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. సీఐ శివప్రసాద్, స్థానికులు వివరాల మేరకు.. తలకొండపల్లి మండలం వెల్‌జాల్ గ్రామానికి చెందిన పులిజాల వెంకటేశ్(31) వ్యక్తిగత పనుల మీద ఇటీవల హైదరాబాద్ వెళ్లాడు. బుధవారం రాత్రి ద్విచక్రవాహనంపై తిరిగి స్వగ్రామానికి వస్తుండగా మక్తమాధారం గేట్ సమీపంలోని మూల మలుపు వద్ద ఎదురుగా గడ్డిలోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు అంబులెన్స్‌లో ఆమనగల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

మున్సిపాలిటీ ట్రాక్టర్ చోరీ

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మున్సిపాలిటీకి చెందిన ట్రాక్టర్, ట్రాలీని దుండగులు అపహరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీలోని చెత్తను మంగళవారం ట్రాక్టర్‌లో నింపి డంపింగ్ యార్డులో వేసిన అనంతరం ఎస్సీ బాలుర వసతి గృహం వద్ద నిలిపి వేశారు. బుధవారం ట్రాక్టర్ కోసం మున్సిపల్ సిబ్బంది రాగా ట్రాక్టర్‌తో పాటు ట్రాలీ సైతం కనిపించలేదు. మున్సిపల్ సూపర్‌వైజర్ శాంతికుమార్ వెంటనే కమిషనర్ జ్ఞానేశ్వర్‌కు సమాచారం అందించగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వినాయకరెడ్డి తెలిపారు.

నుమాయిష్‌కు వేళాయె


వినోదానికి సిద్ధమవుతున్న చుక్ చుక్ రైలు


చురుగ్గా స్టాళ్ల ఏర్పాటు పనులు

- జనవరి 1న ప్రారంభించనున్న సీఎం
- శరవేగంగా కొనసాగుతున్న ఏర్పాట్లు
- 46 రోజుల పాటు కొనసాగనున్న ఎగ్జిబిషన్

అబిడ్స్: అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్)కు సమయం ఆసన్నమైంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జనవరి 1న 83వ నుమాయిష్ ప్రారంభానికి ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. దేశంలోని పలు రాష్ట్రాల ఉత్పత్తులతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన పలు ఉత్పత్తులు, ప్రభుత్వాల స్టాళ్లు ఏర్పాటు చేయనున్నారు. ఎగ్జిబిషన్ ఫిబ్రవరి 15వ తేదీ వరకు 46 రోజుల పాటు కొనసాగనుంది. ఎగ్జిబిషన్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ సుమారు 2,400 స్టాళ్లు కొలువుదీరనున్నాయి.

ఒకేచోట అన్ని వస్తువులు..

ఎగ్జిబిషన్‌లో అన్ని రకాల వస్తువులు ఒకేచోట లభ్యమవుతాయి. నగరంలో దొరకని పలు రాష్ట్రాలకు చెందిన ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయి. దుస్తులు, బెడ్‌షీట్లు, కిచెన్‌వేర్ , మహిళల కోసం పలు విధాల వంట సామగ్రి, వివిధ రకాల దుప్పట్లు, బెడ్‌షీట్లు, కశ్మీరీ డ్రై ఫ్రూట్స్‌తో పాటు ఎలక్ట్రానిక్ వస్తువులు, వివిధ రకాల కొత్త తరహా ఫర్నిచర్స్, పలు విధాల ఉపయోగపడే పలు రకాల సామగ్రి అందుబాటులో ఉంటాయి.

టికెట్ ధర రూ.40..

ఎగ్జిబిషన్‌ను సుమారు 22 లక్షల మంది సందర్శించనున్నట్లు అంచనా. ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా ఎగ్జిబిషన్ సొసైటీ సీసీ కెమెరాల ద్వారా నిఘా ఏర్పాటు చేస్తోంది. ఎగ్జిబిషన్‌కు వచ్చే గోషామహల్, అజంతా గేట్, గాంధీభవన్, గేట్ల వద్ద మెటల్ డిటెక్టర్లతో తనిఖీ చేసి సందర్శకులను లోపలికి అనుమతిస్తారు. టికెట్ ధర రూ.40. వినోదాత్మకమైన పలు విభాగాలు అందుబాటులో ఉంటాయి.

33 సబ్ కమిటీల ద్వారా ఏర్పాట్లు

32 సబ్ కమిటీల ద్వారా ఎగ్జిబిషన్‌ను విజయవంతంగా కొనసాగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఎగ్జిబిషన్ లోపల, బయట సందర్శకులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఎగ్జిబిషన్ సబ్ కమిటీల ప్రతినిధులు తగిన చర్యలు తీసుకుంటారు.

– వనం సత్యేందర్, ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు

విద్యాభివృద్ధికి కృషి

ఎగ్జిబిషన్ నిర్వహణ ద్వారా వచ్చే ఆదాయంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో విద్యారంగ వ్యాప్తికి కృషి చేస్తున్నాం. ముఖ్యంగా మహిళా కళాశాలలు, పాలిటెక్నిక్, ఫార్మసీ, ఇంజినీరింగ్, డిగ్రీ, ఐటీఐ కళాశాలలను స్థాపించి విద్యా వ్యాప్తికి నిరంతరం పాటుపడుతున్నాం.

– బి.హన్మంతరావు, ఎగ్జిబిషన్ కార్యదర్శి